TGTEL/25/A4812

వాయిస్ ఆఫ్ వందే భారత్

Voice of Vande Bharath

తెలుగు దినపత్రిక

సంపుటి : 01| సంచిక : 87 | పేజీలు : 04| వెల: రూ.3/-

తెలంగాణ

శుక్రవారం | అక్టోబర్ 02, 2026

తెలంగాణ ప్రజా రవాణాలో 'డిజిటల్' విప్లవం



2లో..

- ఆర్టీసీ–మెట్రో కామన్ పాస్, 'MeeTicket' యాప్
- ప్రారంభించిన డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క
- 12 ఏళ్ల తర్వాత ఆటో రిక్షా చార్జీల సవరణ.. కనీస చార్జీ రూ.30
- హైదరాబాద్ అభివృద్ధికి రూ.52 వేల కోట్ల పనులు: డిప్యూటీ సీఎం భట్టి

హైదరాబాద్, వాయిస్ ఆఫ్ వందే భారత్ : తెలంగాణ ప్రజా రవాణా వ్యవస్థను మరింత ఆధునికంగా, సమగ్రంగా, ప్రయాణికులకు సులభతరంగా తీర్చిదిద్దే దిశగా రాష్ట్ర ప్రభుత్వం కీలక ముందడుగు వేసింది. తెలంగాణ ప్రభుత్వం, టీజీఎస్ఆర్టీసీ, హైదరాబాద్ మెట్రో రైల్ లిమిటెడ్ సంయుక్తంగా రూపొందించిన 'ఆర్టీసీ–మెట్రో కామన్ పాస్', 'మీ టికెట్' మొబైల్ యాప్, 'డిజిటల్ వీక్లీ బస్ పాస్'లను హైదరాబాద్ ప్రజాభవన్‌లో శుక్రవారం జరిగిన కార్యక్రమంలో ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క లాంఛనంగా ప్రారంభించారు. రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, మంత్రులు వివేక్ వెంకటస్వామి, మహమ్మద్ అజారుద్దీన్‌లతో కలిసి డిప్యూటీ సీఎం కామన్ పాస్‌లను కొనుగోలు చేశారు. శనివారం బేగంపేట నుంచి డిప్యూటీ సీఎం, మంత్రులు కామన్ పాస్‌తో మెట్రో, ఆర్టీసీ బస్సులో ప్రయాణించనున్నారు.



అహింసే ఆయుధంగా.. సత్యమే మార్గంగా..

- బాపూఘాట్ వద్ద గాంధీజీకి ఘన నివాళి
- పాల్గొన్న గవర్నర్, సీఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి



2లో..

గాంధీజీ ఆశయాలు స్ఫూర్తిదాయకం

- గాంధీజీ విగ్రహాన్ని ఆవిష్కరించిన ఎమ్మెల్యే నవీన్ యాదవ్



2లో..

రేవంత్ రెడ్డిది ఆరోపణలు, అబద్ధాల పాలన

- కాంగ్రెస్ వైఫల్యాలను కప్పిపుచ్చుకోవడానికే బీఆర్ఎస్ నేతలపై కక్ష సాధింపు
- మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్
- సిరిసిల్ల నేతన్నలను రోడ్డున పడేసిన రేవంత్ ప్రభుత్వం
- 'దళిత బంధు' నిలిపివేతపై స్పందించని దళిత మంత్రులు సమాధానం చెప్పాలి



4లో..

ప్రభుత్వానికి, ప్రజలకు వారధి గ్రామ పాలనాధికారులే


- జీపీఓల డిమాండ్లను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తాం
- ఆయా డిమాండ్లు పరిష్కారమయ్యేలా మా వంతుగా కృషి చేస్తాం
- జీపీవోల ప్రథమ మహాసభలో నిర్మలా జగ్గారెడ్డి



2లో..

ఓఆర్ఆర్ లోఘోర రోడ్డు ప్రమాదం

- లారీని ఢీకొట్టిన కారు
- ప్రమాదంలో కారు ధ్వంసం



2లో..

వాయిస్ ఆఫ్ Voice of Vande Bharath
వందే భారత్
VOICE OF
VANDE BHARATH
శుక్రవారం, అక్టోబర్ 02, 2026

గాంధీజి ఆశయాలు స్ఫూర్తిదాయకం

• గాంధీజీ విగ్రహాన్ని ఆవిష్కరించిన ఎమ్మెల్యే నవీన్ యాదవ్

హైదరాబాద్, వాయిస్ ఆఫ్ వందేభారత్ : మహాత్మా గాంధీ జయంతిని పురస్కరించుకుని జూబ్లీహిల్స్ నియోజకవర్గంలోని శ్రీనగర్ కాలనీ డివిజన్ పరిధిలోని అంబేద్కర్ నగర్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన మహాత్మా గాంధీ విగ్రహాన్ని స్థానిక ఎమ్మెల్యే వి. నవీన్ యాదవ్ శుక్రవారం లాంఛనంగా ఆవిష్కరించారు. అనంతరం గాంధీజీ విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నవీన్ యాదవ్ మాట్లాడుతూ... అహింస, సత్యాగ్రహం, శాంతి మార్గాల ద్వారా దేశానికి స్వాతంత్ర్యం సాధించిపెట్టిన మహాత్మా గాంధీజీ త్యాగాలు, ఆశయాలు ప్రతీ ఒక్కరికీ స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. విగ్రహ ఏర్పాటుకు చొరవ తీసుకుని సహకరించిన గొంటి సాయినాథ్‌ను ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రత్యేకంగా అభినందించారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, కాలనీ వాసులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

ఓఆర్ఆర్ లో ఘోర రోడ్డు ప్రమాదం

లారీని ఢీకొట్టిన కారు

ప్రమాదంలో కారు తీవ్రంగా ధ్వంసం

ధర్మసాగర్, వాయిస్ ఆఫ్ వందేభారత్ : ధర్మసాగర్ సమీపంలోని టేకులగూడెం జెటర్ రింగ్ రోడ్డు వద్ద గురువారం రాత్రి ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. రహదారిపై నిలిపి ఉంచిన లారీని వేగంగా వచ్చిన కారు వెనుక నుంచి బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో కారు తీవ్రంగా ధ్వంసమైంది. వాహనంలో ప్రయాణిస్తున్న వేలేరు సబ్ ఇన్ స్పెక్టర్ (ఎస్సై) సురేష్ తీవ్రంగా గాయపడినట్లు సమాచారం. ప్రమాదాన్ని గమనించిన స్థానికులు వెంటనే క్షతగాత్రులకు సాయం అందించి, 108 అంబులెన్స్ కు సమాచారం అందించారు. ఘటనాస్థలానికి చేరుకున్న 108 సిబ్బంది బాధితులకు ప్రథమ చికిత్స అందించి, తక్షణ వైద్య నిమిత్తం సమీప ఆసుపత్రికి తరలించారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు ప్రమాదానికి గల కారణాలపై దర్యాప్తు ప్రారంభించారు. ఘటనకు సంబంధించి పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

తెలంగాణ ప్రజా రవాణాలో 'డిజిటల్' విప్లవం

• ఆర్టీసీ–మెట్రో కామన్ పాస్, 'MeeTicket' యాప్
• ప్రారంభించిన డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క
• 12 ఏళ్ల తర్వాత ఆటో రిక్షా చార్జీల సవరణ.. కనీస చార్జీ రూ.30
• హైదరాబాద్ అభివృద్ధికి రూ.52 వేల కోట్ల పనులు: డిప్యూటీ సీఎం భట్టి



హైదరాబాద్, వాయిస్ ఆఫ్ వందే భారత్ : తెలంగాణ ప్రజా రవాణా వ్యవస్థను మరింత ఆధునికంగా, సమగ్రంగా, ప్రయాణికులకు సులభతరంగా తీర్చిదిద్దే దిశగా రాష్ట్ర ప్రభుత్వం కీలక ముందడుగు వేసింది. తెలంగాణ ప్రభుత్వం, టీజీఎస్ఆర్టీసీ, హైదరాబాద్ మెట్రో రైల్ లిమిటెడ్ (హెచ్ఎంఆర్ఎల్) సంయుక్తంగా రూపొందించిన 'ఆర్టీసీ–మెట్రో కామన్ పాస్', 'మీ టికెట్' మొబైల్ యాప్, 'డిజిటల్ వీక్లీ బస్ పాస్'లను హైదరాబాద్ ప్రజాభవన్‌లో శుక్రవారం జరిగిన కార్యక్రమంలో ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క లాంఛనంగా ప్రారంభించారు. రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, మంత్రులు వివేక్ వెంకటస్వామి, మహమ్మద్ అజారుద్దీన్‌లతో కలిసి డిప్యూటీ సీఎం కామన్ పాస్‌లను కొనుగోలు చేశారు. శనివారం బేగంపేట నుంచి డిప్యూటీ సీఎం, మంత్రులు కామన్ పాస్‌తో మెట్రో, ఆర్టీసీ బస్సులో ప్రయాణించనున్నారు.

■ ఒకే పాస్‌తో ఆర్టీసీ - మెట్రో ప్రయాణం

ఆర్టీసీ, మెట్రో వ్యవస్థలను అనుసంధానిస్తూ తీసుకువచ్చిన కామన్ పాస్‌లు అన్ని మెట్రో స్టేషన్లలో లభిస్తాయి. తొలిసారి రూ.100 డిపాజిట్‌తో కార్డు పొంది, తిరిగి ఇచ్చేటప్పుడు ఆ మొత్తం రీఫండ్ పొందవచ్చు. డే పాస్ (రూ.400): మెట్రో పటాన్‌చెరు – ఎల్బీనగర్, మియాపూర్ – నాగోల్ మార్గాల్లో రూ.300 + ఆర్టీసీ సిటీ బస్సుల్లో (పుష్పక్ మినహా) రూ.100. నెలవారీ పాస్ (రూ.8,500): మెట్రోకు రూ.7,000, ఆర్టీసీకి రూ.1,500. గా నిర్ణయించారు.

■ రూ.600కే డిజిటల్ వీక్లీ పాస్

ప్రయాణికులు మొబైల్ ద్వారానే బస్ టికెట్లు, క్యూఆర్ కోడ్ ఆధారిత డిజిటల్ పాస్‌లు కొనుగోలు చేసేందుకు 'MeeTicket' యాప్‌ను అందుబాటులోకి తెచ్చారు. దీని ద్వారా చిల్లర సమస్యలు తీరడమే గాక సమయం ఆదా అవుతుంది. అలాగే వారపు ప్రయాణికుల కోసం రూ.600కే డిజిటల్ వీక్లీ బస్ పాస్‌ను కూడా ప్రవేశపెట్టారు. ఆటో డ్రైవర్ల జీవనోపాధి, పెరిగిన నిర్వహణ వ్యయాలను పరిగణనలోకి తీసుకుని 2014 తర్వాత తొలిసారిగా ఆటో చార్జీలను సవరించారు. కనీస చార్జీ (మొదటి 1.6 కి.మీ): రూ.30, ప్రతి తదుపరి కిలోమీటర్‌కు: రూ.14, రాత్రి చార్జీలు (11 పీఎం– 5 ఏఎం: సాధారణ చార్జీకి 1.5 రెట్లు. త్వరలోనే ఆటో కార్మికుల సంక్షేమ బోర్డును కూడా ఏర్పాటు చేస్తామని మంత్రి పొన్నం ప్రభాకర్ వెల్లడించారు.

■ రూ.52 వేల కోట్ల అభివృద్ధి

ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మాట్లాడుతూ... జీహెచ్ఎంసీ, హెచ్ఎమ్‌డీఏ, వాటర్ వర్క్స్ పరిధిలో నగర మౌలిక వసతుల కోసం రూ.52 వేల కోట్ల అభివృద్ధి పనులు జరుగుతున్నాయని తెలిపారు. రూ.38 వేల కోట్లతో 122 కిలోమీటర్ల మేర మెట్రో ఫేజ్–2 విస్తరణ, మూసీ పునరుజ్జీవనం, 30 వేల ఎకరాల్లో 'భారత్ ఫ్యూచర్ సిటీ' అభివృద్ధి చేయనున్నట్లు వివరించారు. కాలుష్య నివారణకు గాను ఆర్టీసీలో 2,200 ఎలక్ట్రిక్ బస్సులను ప్రవేశపెడుతున్నామని, డీజిల్ ఆటోలను ఈ–ఆటోలుగా మార్చే రెట్రోఫిట్టింగ్ కోసం రూ.200 కోట్లు కేటాయించినట్లు ప్రకటించారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ విప్‌లు పట్నం మహేందర్ రెడ్డి, అద్దంకి దయాకర్, సీఎస్ సంజయ్ జాజు, స్పెషల్ సీఎస్ వికాస్ రాజ్, టీజీఎస్ఆర్టీసీ ఎండీ నాగిరెడ్డి, మెట్రో సలహాదారు ఎన్వీఎస్ రెడ్డి, అధికారులు పాల్గొన్నారు.

ప్రభుత్వానికి, ప్రజలకు వారధి గ్రామ పాలనాధికారులే

◆ జీపీఓల డిమాండ్లను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తాం
◆ ఆయా డిమాండ్లు పరిష్కారమయ్యేలా మా వంతుగా కృషి చేస్తాం
◆ జీపీవోల ప్రథమ మహాసభలో నిర్మలా జగ్గారెడ్డి



సంగారెడ్డి, వాయిస్ ఆఫ్ వందే భారత్ : ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య అనుసంధానకర్తలు గ్రామ పాలనాధికారులేనని డీసీసీ మాజీ అధ్యక్షురాలు నిర్మలా జగ్గారెడ్డి అన్నారు. ప్రభుత్వం చేసే మంచి కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంలో వారిదే కీలక పాత్ర అని ఆమె వివరించారు. గ్రామ పాలన ఆఫీసర్స్ అసోసియేషన్ తెలంగాణ, సంగారెడ్డి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం సంగారెడ్డి పట్టణంలో నిర్వహించిన ప్రథమ మహాసభకు డీసీసీ మాజీ అధ్యక్షురాలు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గత ప్రభుత్వం ఇష్టారాజ్యంగా వ్యవహరించి వీఆర్వో వ్యవస్థను నాశనం చేసిందన్నారు. వాళ్లు చేసే భూ అక్రమాలు వెలుగులోకి రావద్దని ఉద్దేశంతోనే వీఆర్వో వ్యవస్థను తొలగించారన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు కాంగ్రెస్ ప్రభుత్వం అధికారం చేపట్టగానే, తిరిగి వారి సేవలను వినియోగించుకునేలా గ్రామ పాలనాధికారులుగా నియమించారని ఆమె గుర్తు చేశారు. రానున్న రోజుల్లోనూ వారిని మరింత ప్రోత్సహించేలా ప్రభుత్వం పని చేస్తుందన్నారు. ఈ సందర్భంగా అసోసియేషన్ ప్రతినిధులు కొన్ని డిమాండ్లను నిర్మలా జగ్గారెడ్డి దృష్టికి తీసుకొచ్చారు. తప్పకుండా ఈ డిమాండ్లను సీఎం రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళతానని ఆమె హామీ ఇచ్చారు. వాటి పరిష్కారం కోసం తనవంతుగా కృషి చేస్తానన్నారు.

ఈ కార్యక్రమంలో జీపీవోల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు మల్లారం అర్జున్, విజయ్, రాష్ట్ర కార్యదర్శి దాసరి వీరన్న, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు ఎం. చిరంజీవి, ఆర్గనైజింగ్ సెక్రటరీ పృథ్వి రాజ్, జిపివో ల సంఘం సంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు సత్యనారాయణ, సహాయ కార్యదర్శి సుజాత, కాంగ్రెస్ సీనియర్ నాయకులు కూన సంతోష్ , మున్సిపల్ వైస్ చైర్మన్ షఫీ హఫీజ్, టౌన్ కాంగ్రెస్ ప్రెసిడెంట్ కిరణ్ గౌడ్ పాల్గొన్నారు.

అహింసే ఆయుధంగా.. సత్యమే మార్గంగా..

■ బాపూఘాట్ వద్ద గాంధీజీకి ఘన నివాళి
■ పాల్గొన్న గవర్నర్, సీఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి



హైదరాబాద్, వాయిస్ ఆఫ్ వందే భారత్ : భారత జాతిపిత మహాత్మా గాంధీ జయంతిని పురస్కరించుకుని లంగర్‌హౌస్‌లోని బాపూఘాట్ వద్ద తెలంగాణ ప్రభుత్వం, కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో గాంధీజీకి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ, ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే వి. నవీన్ యాదవ్ తదితరులు పాల్గొని గాంధీజీ విగ్రహానికి పుష్పాంజలి ఘటించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... దేశ స్వాతంత్ర్య ఉద్యమానికి అహింస, సత్యాగ్రహం, సత్యమే మార్గంగా దిశానిర్దేశం చేసిన మహాత్మా గాంధీజీ ఆశయాలు నిత్యస్మరణీయమని పేర్కొన్నారు. సత్యం, అహింస, శాంతి, సామాజిక సమానత్వం మరియు సేవా భావాలను ప్రతి ఒక్కరూ తమ నిత్య జీవితంలో ఆచరించడమే మహాత్ముడికి మనం అందించే నిజమైన నివాళి అని అన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు రాష్ట్ర మంత్రులు, ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ ప్రజా ప్రతినిధులు, నాయకులు మరియు ప్రభుత్వ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

వాయిస్ ఆఫ్ Voice of Vande Bharath
వందే భారత్
VOICE OF
VANDE BHARATH
శుక్రవారం, అక్టోబర్ 02, 2026

జనగామలో ఘనంగా కామ్రేడ్ నల్లా నరసింహులు శత జయంతి

- వీరుల పోరాట స్ఫూర్తితోనే బహుజన రాజ్యాధికారం
- కటకం నర్సింగ్ రావు



జనగామ, వాయిస్ ఆఫ్ వందే భారత్ : తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట యోధుడు కామ్రేడ్ నల్లా నరసింహులు 100వ జయంతి వేడుకలను శుక్రవారం జనగామ జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ ఎదురుగా 'మన ఆలోచన సాధన సమితి' ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. శత జయంతి ఉత్సవ కమిటీ చైర్మన్ దొర్నాల వెంకటేశ్వర్లు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు కటకం నర్సింగ్ రావు ముఖ్య అతిథిగా హాజరై, నల్లా నరసింహులు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కటకం నర్సింగ్ రావు మాట్లాడుతూ... నిజాం నిరంకుశత్వానికి, వెట్టిచాకిరీకి వ్యతిరేకంగా పోరాడిన మహనీయుల త్యాగాలను భవిష్యత్ తరాలకు అందించడానికే ఈ ఉత్సవాలు నిర్వహిస్తున్నామన్నారు. బహుజనులలో రాజ్యాధికార కాంక్షను రగిలించి ఐక్యం చేయడమే సమితి ధ్యేయమని పేర్కొన్నారు. సభకు హాజరైన వక్తలు మాట్లాడుతూ... మూడుసార్లు ఉరిశిక్ష పడినా భయపడని ధీరుడు నల్లా నరసింహులు అని, ఆయన విగ్రహాన్ని హైదరాబాద్ ట్యాంక్‌బండ్‌పై ప్రతిష్ఠించడంతో పాటు ప్రముఖ విశ్వవిద్యాలయానికి ఆయన పేరు పెట్టాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేల్, మాజీ ఐఏఎస్ చిరంజీవులు, ప్రముఖ రచయిత పాశం యాదగిరి, నల్లా అరుణ నేత, బీసీ నాయకుడు ఒట్టె జానయ్య యాదవ్, మున్సిపల్ చైర్మన్ కడకంచి బాలమణి శ్రీనివాస్, సమితి ప్రతినిధులు గునగంటి చంద్రశేఖర్ గౌడ్, మంగళంపల్లి రాజు, వివిధ కుల, బహుజన సంఘాల నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



గాంధేయ మార్గం అందరికీ ఆదర్శం

- బీజేపీ జిల్లా ఉపాధ్యక్షులు రాదారపు శివకుమార్

గీసుగొండ, వాయిస్ ఆఫ్ వందే భారత్ : అహింస, సత్యాగ్రహం అనే ఆయుధాలతో భారత స్వాతంత్ర్య పోరాటాన్ని ముందడుగు వేయించిన మహనీయుడు, జాతిపిత మహాత్మా గాంధీ అని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షులు రాదారపు శివకుమార్ కొనియాడారు. మహాత్మా గాంధీ జయంతిని పురస్కరించుకుని శుక్రవారం గ్రేటర్ వరంగల్ 15వ డివిజన్ మొగిలిచర్లలో బిజెపి డివిజన్ అధ్యక్షులు ల్యాదల్ల ప్రభాకర్ ఆధ్వర్యంలో వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని గాంధీ విగ్రహాన్ని నీటితో శుభ్రం చేసి, పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో రాదారపు శివకుమార్ మాట్లాడుతూ.. అహింసా మార్గంలో సుదీర్ఘ పోరాటం చేసి ఆంగ్లేయుల పాలన నుంచి దేశానికి స్వేచ్ఛా స్వాతంత్ర్యాలు సాధించి పెట్టిన ఘనత గాంధీజీకే దక్కుతుందన్నారు. నేటి యువత మహాత్మా గాంధీ చూపిన అడుగుజాడల్లో నడవాలని, ఆయన ఆదర్శాలను ప్రతి ఒక్కరూ పుణికి పుచ్చుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బిజెపి జిల్లా కౌన్సిల్ మెంబర్ బిల్లా రమేష్, జిల్లా నాయకులు ఆడేపు రమేష్, కామగోని రఘుపతి, డివిజన్ ప్రధాన కార్యదర్శి గుండెబోయిన రంజిత్, నాయకులు పిల్లల రవి, లెంకలపెల్లి స్వామి, నముతబాజీ రామకృష్ణ, బండారి కుమారస్వామి, నరిశెట్టి చంద్రమౌళి, రానే రాజు, ఒడ్డబోయిన శ్రీనివాస్, ఇప్ప మల్లేశ్, గ్రామస్థులు కాంచనపెల్లి రమణకర్ రాజు, బిల్లా స్వామి, గాదం రాజు, బిల్లా మల్లయ్య పాల్గొన్నారు.



బాధిత గూడూరు జయశ్రీ కుటుంబానికి విముక్తి కల్పించాలి

- ప్రజా సంఘాల జేఏసీ చైర్మన్ మాదాసి సురేష్

హనుమకొండ, వాయిస్ ఆఫ్ వందే భారత్ : హన్మకొండలోని 52వ డివిజన్ రాంనగర్‌కు చెందిన బాధిత గూడూరు జయశ్రీ కుటుంబాన్ని వెంటనే అక్రమ బంధనం నుండి విముక్తి చేయాలని ప్రజా సంఘాల జేఏసీ జిల్లా చైర్మన్ మాదాసి సురేష్ డిమాండ్ చేశారు. బాధితురాలిని ఇంట్లోనే బంధించి 11 రోజులు గడుస్తున్నా అధికారులు పట్టించుకోకపోవడంపై ఆయన తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. శుక్రవారం రాంనగర్‌లో బాధితురాలిని బంధించిన ఇంటి వద్ద ప్రజా సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించిన నిరసన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. అదనపు కట్నం తెవాలంటూ జయశ్రీని ఆమె అత్త మీరాబాయి, భర్త రాధాకృష్ణ తీవ్రంగా వేధించారని తెలిపారు. ఈ వేధింపులపై గతంలో పోలీసులకు ఫిర్యాదు చేయగా, రాంనగర్‌లోని ఇల్లుతో పాటు ఇతర ఆస్తులను నోటరీ డాక్యుమెంట్ ద్వారా జయశ్రీ పేరు మీద రాసిచ్చారని గుర్తుచేశారు. అయితే, 11 రోజుల క్రితం గుర్తుతెలియని వ్యక్తులతో వచ్చి జయశ్రీ, ఆమె మైనర్ కూతురు తేజస్వినిలను ఇల్లు ఖాళీ చేయాలని బెదిరించారని.. అందుకు వారు అంగీకరించకపోవడంతో బలవంతంగా ఇంట్లోనే అక్రమంగా బంధించి చిత్రహింసలకు గురిచేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. బాధితురాలి తరఫున ప్రజా సంఘాల నాయకులు పోలీసులకు ఫిర్యాదు చేసినా ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం దారుణమన్నారు. ఈ ఘటనపై వెంటనే ప్రభుత్వం, స్థానిక ఎమ్మెల్యే, సీపీ, జిల్లా కలెక్టర్ స్పందించి జోక్యం చేసుకోవాలని కోరారు. గతంలో బాధితురాలికి రాసిచ్చిన ఇల్లు, ఇతర ఆస్తులను ఆమెకు దక్కేలా చేసి న్యాయం చేయాలని, అత్త మీరాబాయిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో ప్రజా సంఘాల ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున పోరాటం చేస్తామని హెచ్చరించారు. ఈ నిరసన కార్యక్రమంలో వివిధ ప్రజా సంఘాల నాయకులు గట్టిగొప్పుల రాములు, మోటపోతుల అభిజిత్, మాదాసి కట్టమల్లు, గట్టి కొప్పుల పద్మ, సంగ సుగుణ, గూడూరు కార్తికేయ తదితరులు పాల్గొన్నారు.



4వ బెటాలియన్‌లో ఘనంగా గాంధీజీ, శాస్త్రిజీల జయంతి వేడుకలు



మామునూరు, వాయిస్ ఆఫ్ వందే భారత్ : 4వ బెటాలియన్ ప్రాంగణంలో జాతిపిత మహాత్మా గాంధీ జయంతి, మాజీ ప్రధాని లాల్ బహదూర్ శాస్త్రి 122వ జయంతి వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అసిస్టెంట్ కమాండెంట్ కె. బాలయ్య ముఖ్య అతిథిగా హాజరై మహనీయుల చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా అసిస్టెంట్ కమాండెంట్ కె. బాలయ్య మాట్లాడుతూ... స్వాతంత్ర్య సంగ్రామంలో గాంధీజీ చూపిన సత్యం, అహింస మార్గాలు ఎప్పటికీ మార్గదర్శకమని కొనియాడారు. అలాగే 'జై జవాన్ – జై కిసాన్' నినాదంతో దేశాన్ని ముందుకు నడిపించిన లాల్ బహదూర్ శాస్త్రి గారి నిరాడంబరత, దేశభక్తి ప్రతి ఒక్కరిలో స్ఫూర్తి నింపుతాయన్నారు. బెటాలియన్ సిబ్బంది మహనీయుల ఆశయాలను స్ఫూర్తిగా తీసుకుని, నిబద్ధతతో దేశ సేవలో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ఈ వేడుకల్లో అసిస్టెంట్ కమాండెంట్ ఈ.వీరన్న, ఆర్ఐలు కార్తీక్, వెంకటేశ్వర్లు, రాజ్ కుమార్, కృష్ణ, ఆర్ఎస్ఐలు, బెటాలియన్ సిబ్బంది పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



అదనపు కట్నం వేధింపులు

నాలుగు నెలల గర్భిణి ఆత్మహత్య

ఏటూరునాగారం, వాయిస్ ఆఫ్ వందే భారత్ : అదనపు కట్నం, భూమి కోసం భర్త, అత్తమామలు వేధింపులకు గురిచేయడంతో నాలుగు నెలల గర్భిణి పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్న విషాద ఘటన ములుగు జిల్లా ఏటూరునాగారం మండలం రోహిర్ గ్రామంలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. రోహిర్ గ్రామానికి చెందిన స్వర్ణలత (25) అనే యువతి హరీష్ అనే వ్యక్తిని ప్రేమ వివాహం చేసుకుంది. వీరికి ఒక కుమారుడు కూడా ఉన్నాడు. కాగా, గత కొంతకాలంగా అదనపు కట్నంతో పాటు భూమి ఇవ్వాలంటూ భర్త, అత్తమామలు ఆమెను తీవ్రంగా వేధించడం మొదలుపెట్టారు. కుటుంబీకుల వేధింపులు రోజురోజుకూ శ్రుతిమించడంతో తట్టుకోలేకపోయిన స్వర్ణలత ఇంట్లో ఉన్న పురుగుల మందు సేవించింది. గమనించిన కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించగా, అక్కడ చికిత్స పొందుతూ ఆమె మృతి చెందింది. మృతురాలి తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై మహేష్ తెలిపారు.

గాంధీజీ ఆశయాలు స్ఫూర్తిదాయకం



పరకాల, వాయిస్ ఆఫ్ వందేభారత్ : పరకాల పట్టణంలోని అమరవీరుల మైదానంలో నిర్వహించిన జాతిపిత మహాత్మా గాంధీ జయంతి వేడుకల్లో పరకాల శాసనసభ్యులు రేవూరి ప్రకాశ్ రెడ్డి పాల్గొని గాంధీజీ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రేవూరి మాట్లాడుతూ... గాంధీజీ బోధించిన సత్యం, అహింస, శాంతి, సేవ అనే మార్గాలు నేటి సమాజానికి ఎంతో స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. గాంధీజీ ఆశయాలను, సిద్ధాంతాలను ప్రతి ఒక్కరూ ముందుకు తీసుకెళ్లడమే ఆయనకు మనం అందించే నిజమైన నివాళి అని అన్నారు.

వాయిస్ ఆఫ్ Voice of Vande Bharath
వందే భారత్

VOICE OF
VANDE BHARATH

శుక్రవారం, అక్టోబర్ 02, 2026

రేవంత్ రెడ్డిది ఆరోపణలు, అబద్ధాల పాలన

- కాంగ్రెస్ వైఫల్యాలను కప్పిపుచ్చుకోవడానికే బీఆర్ఎస్ నేతలపై కక్ష సాధింపు
- మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్
- సిరిసిల్ల నేతన్నలను రోడ్డున పడేసిన రేవంత్ ప్రభుత్వం
- 'దళిత బంధు' నిలిపివేతపై స్పందించని దళిత మంత్రులు సమాధానం చెప్పాలి



కరీంనగర్, వాయిస్ ఆఫ్ వందే భారత్ : రాష్ట్రంలో రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా సంక్షేమాన్ని పూర్తిగా విస్మరించి, బీఆర్ఎస్ నాయకులపై కక్ష సాధింపే ధ్యేయంగా "పోలీస్ రాజ్యం" నడుపుతోందని మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండున్నరేళ్లు (35 నెలలు) గడుస్తున్నా ఇచ్చిన 6 గ్యారెంటీలు, 420 హామీలను నెరవేర్చడంలో దారుణంగా విఫలమైందని ఆరోపించారు. శుక్రవారం కరీంనగర్ జిల్లా కేంద్రంలోని శుభ మంగళి బ్యాంకెట్ హాల్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సిరిసిల్ల పర్యటన సందర్భంగా బీఆర్ఎస్ కార్యకర్తలను అర్ధరాత్రి, ఉదయాన్నే అక్రమంగా అరెస్టు చేయడాన్ని కొప్పుల తప్పుపట్టారు. సీఎంగా రేవంత్ రెడ్డి కేవలం కేసీఆర్, కేటీఆర్, హరీష్ రావులపై వ్యక్తిగత విమర్శలు చేయడానికే సమయం కేటాయిస్తున్నారని, సిరిసిల్ల సభ ముగిసిన రెండు రోజులకే అక్కడ 1861 నాటి బ్రిటిష్ కాలపు పోలీస్ యాక్ట్ సెక్షన్ 30 అమలులోకి తేవడం కాంగ్రెస్ నిరంకుశత్వానికి నిదర్శనమని మండిపడ్డారు.

'ఉరిసిల్ల'ను సగర్వంగా నిలిపింది

కేసీఆరే

గత కాంగ్రెస్ పాలనలో నేత కార్మికుల ఆత్మహత్యలతో సిరిసిల్ల 'ఉరిసిల్ల'గా మారితే, కేసీఆర్ హయాంలో బతుకమ్మ చీరలు, స్కూల్ యూనిఫాం ఆర్డర్లు పవర్ లూమ్ కార్మికులకే ఇచ్చి వేల కోట్ల రూపాయల ఉపాధి కల్పించారని కొప్పుల గుర్తుచేశారు. నూలుపై 40% సబ్సిడీ, 'చేనేత మిత్ర', 'నేతన్నకు చేయూత' వంటి పథకాలతో ఆదుకున్నారని తెలిపారు. కానీ, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం బతుకమ్మ చీరల ఆర్డర్లు ఇవ్వక, పాత బకాయిలు చెల్లించక నేత కార్మికులను మళ్లీ రోడ్డున పడేసిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నికల ముందు గల్ఫ్ కార్మికులకు పునరావాసం, బడ్జెట్ కేటాయింపులని ఆర్భాటం చేసి ఇప్పుడు రూపాయి కూడా కేటాయించకుండా మోసం చేశారన్నారు.

దళితులకు తీవ్ర ద్రోహం

దేశంలోనే ఎక్కడా లేని విధంగా దళితుల ఆత్మగౌరవాన్ని పెంపొందించేలా కేసీఆర్ 'దళిత బంధు' తెచ్చి రూ.10 లక్షలు అందిస్తే, కాంగ్రెస్ రాగానే ఆ పథకాన్ని పూర్తిగా నిలిపివేసి దళితులకు ద్రోహం చేసిందని ఆరోపించారు. ఎన్నికల్లో హామీ ఇచ్చిన రూ. 12 లక్షల 'అంబేద్కర్ అభయ హస్తం' ఏమైందో కాంగ్రెస్‌లోని దళిత మంత్రులు, ఎమ్మెల్యేలు రేవంత్ రెడ్డిని నిలదీయాలని డిమాండ్ చేశారు.

శ్వేతపత్రాలు విడుదల చేసే ధైర్యం ఉందా?

హైడ్రా పేరుతో, ప్రాజెక్టుల రీ-డిజైన్ల పేరుతో కాంగ్రెస్ ప్రభుత్వం ఎంత దోచుకుందో, ఢిల్లీకి ఎన్ని వేల కోట్లు పంపిందో దానిపై ముందు శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. 'ఓటుకు నోటు' కేసులో కెమెరా ముందర దొరికిపోయిన చరిత్ర ఉన్న రేవంత్ రెడ్డికి నిజాయితీ గురించి మాట్లాడే అర్హత లేదన్నారు. ఈ విలేకరుల సమావేశంలో జగిత్యాల జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే విద్యాసాగర్ రావు, మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్, మాజీ ఎమ్మెల్సీ నారదాసు లక్ష్మణ్ రావు, మాజీ మేయర్ సర్దార్ రవీందర్ సింగ్, నాయకులు పొన్నం అనిల్, తన్నీరు శరత్ రావు, హరిచరణ్ రావు, కార్పొరేటర్లు గుగ్గిళ్ల జయశ్రీ, మల్లేశం, నేతి రవివర్మ, కార్పొరేటర్లు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

వరంగల్ ఫోటోగ్రాఫర్ శరత్ బాబుకు 'ఎక్సలెన్స్ అవార్డ్ ఆఫ్ ది ఇయర్ 2026'

- పలు సంఘాల ప్రతినిధుల అభినందనలు





వరంగల్, వాయిస్ ఆఫ్ వందే భారత్ : భారతదేశ 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను పురస్కరించుకుని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సృజనాత్మక, సాంస్కృతిక కమిషన్, ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం సహకారంతో 'ఫోటోగ్రఫీ అకాడమీ ఆఫ్ ఇండియా' జాతీయ స్థాయిలో నిర్వహించిన ఫోటోగ్రఫీ పోటీలలో వరంగల్ జిల్లా శంభునిపేటకు చెందిన వనం శరత్ బాబు ప్రతిష్టాత్మక 'ఎక్సలెన్స్ అవార్డ్ ఆఫ్ ది ఇయర్ 2026' కు ఎంపికయ్యారు. "నా భారతదేశం: 80 ఏళ్ల ప్రజాస్వామ్యం, స్వాతంత్ర్యం" అనే ఇతివృత్తంతో నిర్వహించిన ఈ పోటీలలో దేశంలోని 16 రాష్ట్రాల నుంచి 182 మంది ఫోటో కళాకారులు 352 ఛాయాచిత్రాలను సమర్పించారు. దేశ సాంస్కృతిక వైవిధ్యం, ప్రజాస్వామ్య స్ఫూర్తిని ప్రతిబింబించేలా శరత్ బాబు తీసిన ఫోటో జాతీయ స్థాయిలో ఉత్తమ పురస్కారానికి ఎంపికైంది. వరంగల్ వాసికి ఈ జాతీయ స్థాయి పురస్కారం దక్కడం పట్ల స్థానిక కాకతీయ సేవా సమితి, మిత్ర, జనతా, వీరభద్ర, వినాయక, జై హనుమాన్, సుభాష్ చంద్రబోస్, వీరాంజనేయ పరపతి సంఘాల అధ్యక్ష కార్యదర్శులు, సభ్యులు శరత్ బాబుకు ప్రత్యేక అభినందనలు తెలియజేశారు.

దళితుల జోలికి వస్తే ఊరుకునేది లేదు



హనుమకొండ, వాయిస్ ఆఫ్ వందే భారత్ : "అణగారిన దళితుల పక్షాన ఉంటావా? లేక దళితులను అవమానపరిచే వర్గం పక్షాన ఉంటావా? రసమయి బాలకిషన్ ఖబడ్దార్" అని హనుమకొండ జిల్లా ఎస్సీ సెల్ చైర్మన్, ఇతర నాయకులు తీవ్రస్థాయిలో హెచ్చరించారు. శుక్రవారం విలేకరుల సమావేశంలో ఎస్సీ సెల్ నాయకులు కొడవటి రవి, నోముల ప్రశాంత్, గిన్నారపు రాజులు మాట్లాడారు. కేసీఆర్ సొంత కూతురు, అన్న కూతురు కూడా కేసీఆర్ వద్ద ఉన్నది అవినీతి సొమ్మేనని చెబుతున్నారని, దీనిని బట్టి ఆయన పదేళ్ల పాలనలో ఎంతగా దోచుకున్నారో స్పష్టమవుతోందని నాయకులు ఆరోపించారు. "ఇది రాజుల కాలం కాదు, కాలం మారింది. దళితుల జోలికి వస్తే సహించేది లేదు" అని స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా సంక్షేమ పథకాలతో సబ్బండ వర్గాలకు మేలు చేస్తుంటే, చూసి తట్టుకోలేక కేసీఆర్, కేటీఆర్‌లు లేనిపోని ఆరోపణలు చేస్తున్నారని మండిపడ్డారు. తెలంగాణ ఉద్యమంలో గజ్జె కట్టి, డప్పు కొట్టి, పాటలు పాడి ముందుండి నడిచింది దళితులేనని వారు గుర్తు చేశారు. కానీ అధికారంలోకి వచ్చాక కేటీఆర్ దళితులను ఏనాడు పట్టించుకోలేదని, సిరిసిల్ల ప్రాంతంలో తమను దారుణంగా హింసించారని ఆవేదన వ్యక్తం చేశారు. దానికి నేరేళ్ల ఘటనే సజీవ సాక్ష్యమని పేర్కొన్నారు. తెలంగాణ తొలి ముఖ్యమంత్రి దళితుడేనని నమ్మించి, తీరా అధికారం రాగానే పీఠం ఎక్కి దళితుల భూములు గుంజుకున్న చరిత్ర కేసీఆర్‌దని ధ్వజమెత్తారు. దళిత మంత్రులైన తాటికొండ రాజయ్యను ఉన్నపళంగా ఉప ముఖ్యమంత్రి, మంత్రి పదవి నుంచి తొలగించడమే కాకుండా, కొప్పుల ఈశ్వర్‌ను తీవ్రంగా అవమానపరిచారని విమర్శించారు. అంతేకాకుండా శాసనసభలో దళిత స్పీకర్‌ను తన ప్రజాప్రతినిధులతో అవమానకరంగా తిట్టించిన ఘనత కేసీఆర్, కేటీఆర్‌లదేనని, దళితులంటే కేసీఆర్ కుటుంబానికి ఎందుకంత కక్ష అని సూటిగా ప్రశ్నించారు. ఎమ్మెల్యే టికెట్ కోసం వెలమ దొరలకు వత్తాసు పలుకుతున్న రసమయి బాలకిషన్ ఇకనైనా తన వైఖరి మార్చుకోవాలని, లేకుంటే దళితుల ఆగ్రహానికి గురికాక తప్పదని హెచ్చరించారు.

కమలాపూర్ లో గాంధీ జయంతి వేడుకలు



కమలాపూర్, వాయిస్ ఆఫ్ వందే భారత్: జాతిపిత మహాత్మా గాంధీ జయంతి సందర్భంగా కమలాపూర్ వ్యవసాయ మార్కెట్ యార్డులో శుక్రవారం గాంధీజీ చిత్రపటానికి మార్కెట్ కమిటీ చైర్మన్ తౌటం ఝాన్సీరాణి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... దేశ స్వాతంత్ర్య పోరాటంలో కాంగ్రెస్ పార్టీ, మహాత్మా గాంధీ రెండు కళ్లలా పనిచేశారని కొనియాడారు. అయితే, కొన్ని మతతత్వ పార్టీలు గాంధీజీ చరిత్రను వక్రీకరిస్తూ, కాంగ్రెస్ సుదీర్ఘ చరిత్రను మరుగున పరిచేందుకు కుట్రలు చేస్తున్నాయని విమర్శించారు. ఇందులో భాగంగానే 'మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం' పేరు మార్చి, దానిని నిర్వీర్యం చేయడం అత్యంత దారుణమని, ఇటువంటి చర్యలకు పాల్పడేవారిని దేశద్రోహులుగా పరిగణించాలని అన్నారు. మార్కెట్ డైరెక్టర్లు సముద్రాల కృష్ణ, జనగాని శివకృష్ణ, ఆకినపల్లి భిక్షపతి, గట్టు శ్రీధర్, కిన్నెర కృష్ణమూర్తి, మార్కెట్ కార్యదర్శి జన్ను యాకయ్య, అబ్బరవేణి అనిల్, మార్కెట్ సిబ్బంది పాల్గొన్నారు.

నల్లా నర్సింహులు జీవిత చరిత్రను పాఠ్యాంశంగా చేర్చాలి

చిప్ప వెంకటేశ్వర్లు నేత డిమాండ్



వరంగల్, వాయిస్ ఆఫ్ వందేభారత్ : తెలంగాణ సాయుధ పోరాట యోధుడు, 'విప్లవ సింహం' నల్లా నర్సింహులు త్యాగాలను స్మరించుకుంటూ ఆయన జీవిత చరిత్రను పాఠ్యాంశంగా చేర్చాలని చేనేత నాయకుడు చిప్ప వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. నల్లా నర్సింహులు శతజయంతి సందర్భంగా కొత్తవాడ 80 ఫీట్ల రోడ్డులోని అమరవీరుల స్థూపం వద్ద ప్రజాసంఘాల నాయకులతో కలిసి ఆయన నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... నిజాం నవాబుల భూస్వామ్య, వెట్టిచాకిరి వ్యవస్థకు వ్యతిరేకంగా ప్రజా సైన్యాన్ని సిద్ధం చేసి పోరాడిన ధీరుడు నల్లా నర్సింహులు అని కొనియాడారు. 4 వేల గ్రామాలు, 15 వేల ఎకరాల భూమిని భూస్వాముల నుంచి విముక్తి చేసి పేదలకు పంచడంలో ఆయన కీలక పాత్ర పోషించారని గుర్తుచేశారు. మూడుసార్లు ఉరిశిక్ష పడినా, అడవుల్లో తలదాచుకుంటూ భార్య వజ్రమ్మతో కలిసి చివరివరకు పోరాడారని అన్నారు. ఈ కార్యక్రమంలో 23 వ డివిజన్ అధ్యక్షులు దామెర రాజ్ కమల్, చేనేత విభాగం జిల్లా అధ్యక్షులు దాసరి రాజశేఖర్, సహకార సంఘాల అధ్యక్షులు దువ్వల రాజేందర్, అడిగొప్పుల సంపత్, పిట్ట రాములు, ఆడెపు రవి, బొల్లు సతీష్, రావుల రాజీవ్, మాటేటి రాములు, వల్లాల మొగిలి, బూర వేణుమాధవ్, దాసరి రాజయ్య, నంబి మురళి, దేవర రాము, బండి రమేష్, తుమ్మ రాము, గుత్తికొండ తిరుపతి, కూచన రవి, గొండ ప్రసాద్, బస్వరాజు మల్లేశం, జంపాల వేణుగోపాల్, దొంతుల ఉమా, బండారి లావణ్య పాల్గొన్నారు.